డిట్రాయిట్ తెలుగు లిటరరీ క్లబ్

# కథా సంకలనాల పై చర్చా సమీక్ష

చర్చా స్థలం, సమయం - ఫార్మింగ్టన్ హిల్స్, మిషిగన్; మార్చి, 7, 2004

చర్చలో పాల్గొన్న వారు - రావినూతల రవిసుధీర్, నందుల మురళీకృష్ణ, ఆరి సీతారామయ్య, పత్రి అనిల్‌కుమార్, గోలి శ్రీనివాసరావు, రుద్రరాజు సుధ, బూదరాజు కృష్ణమోహన్, ఆళ్ళ గణేష్, తేలప్రోలు నళిని, గుళ్ళపల్లి రవి, బి. లక్ష్మీనరసింహరాజు, ముసునూరి ఆనంద్, కన్నెగంటి రామారావు, మరియు మద్దిపాటి కృష్ణారావు.

చర్చా సమీక్షకులు - మద్దిపాటి కృష్ణారావు

డిట్రాయిట్ తెలుగు లిటరరీ క్లబ్ మార్చి 7వ తేదీ సమావేశంలో, 2003 వ సంవత్సరంలో ప్రచురించబడ్డ రెండు తెలుగు కథా సంకలనాలు, “కథ 2002“ మరియు “కథా వార్షిక 2002“, పై చర్చ జరిగింది. కథా సాహితి వారు 1990 నుండి ప్రతి సంవత్సరం వివిధ పత్రికలలో ప్రచురించబడిన కథలలో సుమారు 15 ఉత్తమమైన కథలను ఎంపిక చేసి సంకలనాలుగా ప్రచురిస్తూ వస్తున్నారు. ఇంచుమించు ఇలాంటి సంకలనాలనే తెలుగు విశ్వవిద్యాలయం వారు 1995 నుండి (వీరి 2002 సంకలనం ఇంకా వచ్చిన జాడ లేదు) , మధురాంతకం రాజారాం సాహితీ సంస్థ వారు 2000 నుండి ప్రచురిస్తున్నారు. విజయవాడ సాహితీ మిత్రులు (వీరెవరో వారి పుస్తకంలో ఎక్కడా చెప్పబడలేదు) కథలతో పాటు రచయితల చేత కథా నేపథ్యాన్ని, విమర్శకుల చేత విమర్శను ప్రతి కథకు వ్రాయించి 2000 లో ఒక సంకలనాన్ని ప్రచురించారు. మేము ఈ సమావేశంలో పైన వివరించిన రెండు సంకలనాలను చర్చించడానికి ఎన్నుకోవడంలో ముఖ్యోద్దేశం, ఇటీవల పోటీగా వస్తున్న సంకలనాలను పరిశీలించి, జరుగుతున్న సంకలన ప్రక్రియను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించి, చేతనైనంత వరకు సద్విమర్శ చెయ్యడం.

సమకాలీన సమాజానికి అద్దం పడుతూ విస్తరిస్తున్న తెలుగు కథను ప్రచారం చెయ్యడానికి పూనుకున్న ఈ కథా సంకలనాలు తెలుగు సాహిత్యాభివృద్ధికి ఎంతో సహకరిస్తున్నాయనడానికి సందేహమేమీలేదు. రెండు సంకలనాల్లోనూ ఉన్న కథలన్నీ, లోపాల మాటెలా ఉన్నా, మంచి కథలని ఒప్పుకోవడానికి వెరవాల్సిన పనిలేదు. అన్ని కథలూ అందరికీ ఎలాగూ నచ్చవు. విస్తృత పరిధిలో సమీకరించిన కథల్లో ఎక్కువ శాతం విమర్శకుల మన్ననలను పొందగలిగితే సంకల్పం నెరవేరినట్లే. అక్కడక్కడా వినవచ్చిన ప్రఖ్యాత విమర్శకుల పరిశీలనలనుబట్టి చూస్తే, మంచి కథలను ఎన్నుకోవడంలో ఈ సంకలనాలు సఫలీకృతమయ్యాయనే అనిపిస్తుంది. కథలకు సంబంధించిన మా అభిప్రాయాలను వేరుగా పొందుపరచాము. ముందుగా ఈ సంకలనాల గురించి, వీటిలో ఉన్న ప్రత్యేక వ్యాసాల గురంచి ప్రస్తావిస్తాము.

“కథ 2002“ “14 ఉత్తమ కథల సంకలనం“ అని మొదటి పేజీలో చెప్పుకోవడంతో 2002 లో ప్రచురించబడిన కథల్లో సంపాదకులకు (వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్) ఈ కథలు ఉత్తమమైనవిగా తోచినవి అని తెలుస్తుంది. అలాగే “కథా వార్షిక 2002“ లో “7 మంచి కథలను ఎన్నుకున్నామని“ సంపాదకులు (వి. ఆర్. రాసాని, మధురాంతకం నరేంద్ర) చెప్పడంలో తెలుస్తుంది. మొత్తం మీద మూడు కథలు (పెండెం సోడా సెంటర్, గుండ్లకమ్మ తీరాన, ఆవర్జా) ఈ రెండు సంకలనాలలోను చోటు చేసుకున్నాయి. ఇంకొక విశేషమేమిటంటే, ఇద్దరు రచయితలు (సుంకోజి దేవేంద్రాచారి, పెద్దింటి అశోక్‌కుమార్) వ్రాసిన కథలు రెండు సంకలనాల్లోనూ ఉన్నా, అవి ఒకే కథలు కావు; నాలుగు వేరు వేరు కథలు. “జిహ్వాకో రుచి, జిమ్మకో బుద్ధి“ కాబట్టి, నలుగురు సంపాదకులు ఏరిన మొత్తం 21 “ఉత్తమ“ కథల్లో 17 కథల పై ఏకాభిప్రాయం లేకపోవడంలో వింతేమీ లేదు. కాని, ఈ కథల ఎంపికలో సంపాదకులు తాము నిర్ణయించుకున్న పరిమాణాలేవో స్థూలంగానైనా తెలియజేసి ఉంటే బాగుండేది (ఇదే విషయాన్ని "కథా వార్షిక 2002" లో ప్రచురించిన "చర్చ"లో వల్లంపాటి వెంకట సుబ్బయ్య గారు, ఓల్గా గారు ప్రస్తావించడం గమనించదగ్గది) . దీని వల్ల ఈ సంకలనాల ఉద్దేశమేమిటో కేవలం సంపాదకులకే కాకుండా అందరికీ తెలిసే అవకాశం ఉంటుంది. అంతేకాదు, సంపాదకులు తాము నిర్ణయించుకున్న ప్రమాణాలకు ఎంత చేరువగా ఉన్నారో పాఠకులు పరిశీలించే అవకాశం కూడా ఉంటుంది. కేవలం “మంచి“ “ఉత్తమ“ వంటి విశేషణాలు మనిషికొక రకంగా మారతాయన్నది అందరికి తెలిసిందే. ఏది “మంచిది“ “ఉత్తమమైనది“ అనుకుంటున్నారో కాస్త వివరిస్తే చాలు. దీనికి పేజీలు నింపక్కరలేదు. ఒక్క పేరా అయినా చాలు. ఇంకొక విషయం. సంపాదకుల గురించిన వివరాలు కూడా ప్రతి సంపుటంలోనూ ప్రచురించడం ఎంతైనా ఉపయోగకరం. ఇలాంటి వివరాలన్నీ ఈ సంకలనాల విలువ, చరిత్ర తెలిసిన వారికి అవసరం లేకపోయినా, ఈ పుస్తకాలను కొత్తగా పుస్తకాల షాపులో కనుగొన్న పాఠకుడికి తెలియాలి. సిరీస్ గా వచ్చే శాస్త్రీయ గ్రంథాలను చూస్తే ఈ విషయం ఇట్టే బోధపడుతుంది. చర్విత చర్వణంగా ప్రతి సంకలనంలోనూ ఈ ప్రమాణాలను, సంపాదకుల పరిచయాలను ముద్రించడం ఖర్చు, విసుగు అనిపించవచ్చునేమోగాని, కొత్తగా ఒక సంకలన సంపుటాన్ని

గుర్తించిన పుస్తక ప్రియుణ్ణి పాఠకుడిగా చెయ్యడానికి ఎంతో సహకరిస్తుంది. “ఈ సంకలనాలేమిటో అందరికి తెలుసు, కొనే వాళ్ళెలాగూ కొంటారు“ అనుకుంటే, కొత్త పాఠకులను కావాలని వదులుకోవడమే. తెలుగు కథా సాహిత్యాన్ని విరివిగా ప్రచారం చెయ్యాలనుకుంటున్న సంకలనకర్తలు కొత్త పాఠకులను కావాలని వదులుకుంటారనుకోము! అలాగే, ఈ సంకలనా ప్రక్రియపై కొన్ని వివరాలు కూడా ఇస్తే బాగుండేది. ఉదాహరణకు, ఎన్ని కథలు పరిశీలనలోకి వచ్చాయి, సంకలనంలో చోటు చేసుకోలేకపోయిన కథల్లో తమ ప్రమాణాల చేరువలో ఉన్న చదువదగ్గ కథల జాబితా, మొదలైన వివరాలు ఈ సంకలనాలకు సమగ్రతను చేకూర్చి ఉండేవి. ఇలాంటి వివరణల ద్వారా, ప్రమాణాల ప్రకటనల ద్వారా “నా రచనలను విస్మరిస్తున్నారని“ లేదా “తమ ప్రాంతాన్ని విస్మరిస్తున్నారని“ వచ్చే చౌకబారు విమర్శలకు కొంతైనా ఆనకట్ట కట్టవచ్చు, లేకపోతే ఇలాంటి కువిమర్శలకు అనాయాచితంగా గుర్తింపు వచ్చే ప్రమాదం లేకపోలేదు!

రెండు సంకలనాల సంపాదకులూ కథా సాహిత్య సద్విమర్శ ఆవశ్యకతను వారి వారి ఉపోద్ఘాతాల్లో స్పష్టంగానే చెప్పారు. కేవలం పొగడ్తల, తెగడ్తలకు పరిమితం కాకుండా సిద్ధాంత పరమైన విమర్శ జరగాల్సిన ఆవశ్యకతను పాపినేని శివశంకర్ (కథ 2002) వివరించారు. నిర్మొహమాటంగా సాహితీ విమర్శ తెలుగులో జరగాల్సి ఉందన్న విషయాన్ని వల్లంపాటి వెంకట సుబ్బయ్య గారు కూడా "కథా వార్షిక 2002"లో ఉన్న చర్చలో చెప్పారు. “కథా వార్షిక 2002“ లో జతపరచిన “సింహావలోకనం“ వ్యాసం, “నేటి తెలుగు కథానిక తీరు తెన్నులు“ చర్చ, ఆ సంకలనంలో ప్రచురించబడిన కథలపై విమర్శనావసరాన్ని తీరుస్తాయనుకుంటే మిగిలింది ఆశాభంగం మాత్రమే!

సింగమనేని నారాయణ గారి “సింహావలోకనం“ లో (కథా వార్షిక 2002) 2002 లో ప్రచురించబడిన కథల్లో ప్రస్తావించదగ్గ కథలన్నిటినీ పరామర్శించినట్టుగా ఉంది. మంచి కథల ప్రస్థావన బాగానే ఉంది గానీ, కొన్ని కొన్ని కథలపై ఆయన వ్రాసిన సుదీర్ఘమైన వ్యాఖ్యానం చదువుతుంటే, ఈ సంకలనంలో చోటు చేసుకున్న కథల కంటే అవే మంచివేమో, అయితే వాటిని ఎందుకు ఎన్నుకోలేదు అన్న ప్రశ్న ఉదయించక మానదు. ఉదాహరణకు, “బొక్కలు మోసే గాడ్దె“ కథను ఈయన చర్చించిన తీరు చూస్తే (11 వ పేజి, సుమారు ముప్పాతిక పేజి వెచ్చించారు), ఆయనకు అంతగా నచ్చిన కథను ఎందుకు వేయలేదో తెలియదు. ఒక వేళ నచ్చిన వాటికన్నా నచ్చని అంశాలు ఎక్కువగా ఉన్నాయేమో అనుకుంటే, వాటిని ఆయన వ్రాయలేదు. అలాగే, “మాయ జలతారు“ (పేజి 13), “ఆటపట్టు“ (పేజి 24), “నెత్తురోడుతున్న నేల“ (పేజి 26), “బిచ్‌డీ చమన్“ (పేజి 26) మొదలైన కథల ప్రస్థావన కూడా. ఒక్క “ఒక వసుంధర“ కథను మాత్రం సవ్యంగా విమర్శించారనిపిస్తుంది (పేజి 21). ఈ కథ గుణగణాల్ని పొగుడుతూనే, రచనా శైలిలో ఉన్న లోపాన్ని వివరంగా తెలియజేశారు. గోపిని కరుణాకర్ కథను (కల్లేటి వంక), మాంత్రిక వాస్తవికతను విమర్శించడానికి 3 పేజీలు వెచ్చించిన సింగమనేని వారికి మిగిలిన కథలలోని లోపాలను (లోపాలే లేకపోతే ఈ కథాసంకలనంలో ఎందుకు చోటు చేసుకోలేదో) వివరించడానికి 44 పేజీల సుదీర్ఘ వ్యాసంలో చోటే లేదా? కథా ప్రస్తావనలో విమర్శకు కావలసినంత రీతిలో సామాజిక విషయాలను చర్చించడంలో తప్పు లేదు. కాని అంతటితో ఆగక అక్కడక్కడా రాజకీయ ఉపన్యాసాలతో సాగిందీ వ్యాసం (ఉదాహరణకు 11 పేజీ చివరి భాగం చూడండి). “ఒక్క అనంతపురం జిల్లా లోనే వేరుశెనగ రైతులు వేల సంఖ్యలో ఆత్మహత్యలు చేసుకున్నారని“ అతిశయీకరించడం రాజకీయ నాయకుల పని గాని విమర్శకుల పని కాదు. వార్తాపత్రికల ప్రకారం 2002 లో రాష్ట్రం మొత్తంలో జరిగిన రైతుల ఆత్మహత్యలు 228, గత 5 సంవత్సరాలలో జరిగినవి సుమారు వెయ్యి. ఏ ఒక్క రైతు ఆత్మహత్యకు పాలపడవల్సి వచ్చినా అది అత్యంత విషాదకరమైన విషయమే. తులనాత్మక పరిశీలన చేయవలసిన సాహిత్య విమర్శకులు అతిశయీకరణకు పోతే ఆత్మహత్యకు లోనయ్యేది విమర్శే!

“తెలుగు కథానిక తీరు తెన్నులు" చర్చ (కథా వార్షిక 2002) లో పాల్గొన్న వారందరూ హేమాహేమీలైన రచయితలు, విమర్శకులు (వల్లంపాటి వెంకట సుబ్బయ్య, కె. శ్రీనివాస్, ఓల్గా, నవీన్ (అంపశయ్య రచయిత), బండి నారాయణస్వామి, రాచపాళెం చంద్రశేఖరరెడ్డి). ఈ చర్చ కు సమన్వయకర్త (మోడరేటర్) ఎవరో తెలియదు (అసలు ఉన్నారా అన్న అనుమానం ప్రబలంగా ఉంది). చర్చకు ఎన్నుకున్న అంశాలేమిటో సమన్వయకర్త (?) గాని, చర్చలో పాల్గొన్నవారు గాని వివరించరు. చర్చకు సంబంధించిన ఉపోద్ఘాతంలో సంపాదకుల (లేదా నిర్వాహకుల?) “2002వ సంవత్సరంలో వచ్చిన కథలలోంచీ ఎన్నికచేసిన 30 ముఖ్యమైన ....... కథల నేపథ్యంలో గత దశాబ్దిగా కొనసాగుతూ వస్తున్న కథానికా ధోరణులను గురించి చర్చించడం ....“ అన్న వాక్యాల్లో కొంతగా అంశ నిర్ధారణ ఉన్నట్టు కనిపించినా, ఇది ఒక అంతం, నిబద్ధత లేని చర్చాంశం (open-ended discussion topic) అనిపించక తప్పదు. 66వ పేజీలో ఓల్గా గారు “చర్చలోని మరో అంశం పాత కథల్ని పునర్మూల్యాంకనం చెయ్యడం“ అంటారు. అలాగే, వల్లంపాటి గారు కూడా రెండు మూడు సందర్భాల్లో చర్చాంశాల్ని వివరించే ప్రయత్నం చేస్తారు. అంటే చర్చాంశాలనేవి ఏవో ఉన్నాయన్న మాట. కానీ అవెక్కడా వివరించకుండానే “చర్చ“ సాగింది. దాంతో కాస్తో కూస్తో చర్చాంశాలంటూ ఉన్నా వాటిని తవ్వి తియ్యడానికి పాఠకుడికి అవకాశం లేకపోవడంతో అది ఇష్టాగోష్ఠిలా అనిపిస్తోంది. అంతమాత్రాన ఈ చర్చలో విలువగల అంశాలు, సంభాషణలూ లేవని కాదు. కాని, 33 పేజీల ఇష్టాగోష్ఠిలో అక్కడక్కడా ఇసుక రేణువుల్లా ఉన్న వీటిని తవ్వి తీయాల్సి రావడం "కొండను తవ్వి ఎలుకను పట్టే" ప్రయత్నమే. సామాజిక, రాజకీయ అంశాలపై పుష్కళంగా జరిగిన గోష్ఠిలో కథల గురించి, కథానికల తీరు తెన్నుల గురించి వచ్చిన ప్రస్థావన ఒక సైడ్ షో లా ఉంది. ఉదాహరణకు, ముందు నాలుగైదు పేజీల గ్లోబలైజేషన్ గోష్టిలో కథల ప్రస్థావన రెండు మూడు సార్లకంటే లేదు. అలాగే ప్రాంతీయ వాదాల – మాండలికాల చర్చల్లో కూడా. ఏ విషయ చర్చ ఎప్పుడు ముగిసిందో, కొత్తది ఎప్పుడు ప్రారంభమయ్యిందో ఆ బ్రహ్మకెలాగూ తెలియదు.

కనీసం సంపాదకులైనా వివరించి ఉంటే బాగుండేది. సంపాదకీయం కేవలం ఆడియో టేపుల్లోంచి అక్షరరూపంలోకి మార్చడమే కాదు కదా! ఇంకొక చిత్రమేమిటంటే, 59 వ పేజీలో వల్లంపాటి గారు తెలుగు సాహిత్య విమర్శ "ఓపెన్‌గా చర్చించే వాతావరణాన్ని సృష్టించుకోలేదని" "ఓపెన్‌నెస్‌ను పెంచుకోవలసి ఉంది" అంటూనే, నవీన్ గారి ("అంపశయ్య" రచయిత) "పాపినేని శివశంకర్ కథ రాస్తే అందులో (కథా సాహితి సంకలనాల్లో) తప్పకుండా ఉంటుంది. నాలాంటి వాడు పది కథలు రాసినా అందులోకి రావు" అని వాసిరెడ్డి నవీన్ (కథా సాహితి సంపాదకుల్లో ఒకరు) సంపాదకత్వాన్ని విమర్శించడాన్ని అదుపు చెయ్యడానికి ప్రయత్నించరు. అంపశయ్య నవీన్ గారు వాసిరెడ్డి నవీన్ సంపాదకత్వాన్ని విమర్శించాలనుకోవడంలో ఎంతమాత్రమూ తప్పు లేదు. కానీ అది సహేతుకంగా లేకపోవడం తప్పు. తన "పది కథలు" శివశంకర్ గారి "ఒక కథ" విమర్శకుల దృష్టిలో ఎలా నిలిచాయో చూపించి ఉంటే ఈ అభియోగానికి విలువుండేది. అలాంటి వివరాలేమీ లేకుండా చేసే అభియోగాలు కేవలం "అందని ద్రాక్షపళ్ళు పుల్లన" అన్నట్టుంటాయేగాని విమర్శనిపించుకోదు. చర్చలో పాల్గొన్న వారెవరూ కూడా ఈ లోపాన్ని సవరించక పోవడం ఈ వేదిక బలహీనతను మరింత ఋజువు చేస్తుంది. ఇలాంటి విషయ నిష్ఠత లేని సంభాషణలను ఏరివెయ్యకపోవడం సంపాదకీయ లోపం కూడా.

"కథ 2002" లో, కె. శ్రీనివాస్ గారి వ్యాసం "తెలంగాణా కథా చరిత్ర - కొన్ని సమస్యలు" తెలంగాణా సాహిత్య, సామాజిక చరిత్ర గురించిన ఎన్నో విషయాలు తెలియజేసింది. కోస్తా ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాల కథా సాహిత్య పరిణామం ఆయా ప్రాంతాల సామాజిక, రాజకీయ పరిస్థితులకనుగుణంగా ఎలా జరిగిందో తెలిపే విషయాలెన్నో ఈ వ్యాసంలో ఉన్నాయి. అయితే, ఈ వ్యాసం చదువుతున్నంత సేపూ రచయిత ఎవరిమీదో చాలా కోపంతో వ్రాశారని అనిపించక తప్పదు. ఎవరో తెలంగాణాకు సాహిత్య చరిత్ర లేదన్నారని, తెలంగాణా వాంఙ్మయానికి విలువ లేదన్నారని, తెలుగు సాహిత్య ప్రమాణాల్ని ప్రతిఫలిస్తున్నట్లుగా చెప్పుకునే గ్రంధాలేవో తెలంగాణా సాహిత్యాన్ని విస్మరించాయని రచయిత చాలా కోపంతో ఉన్నట్టు స్పష్టంగా తెలుస్తుంది. ఏ మనిషినైనా, ప్రాంతాన్నైనా, సమూహాన్నైనా అకారణంగా చరిత్రహీనుల్ని చేసినా, వారికి అసత్యాలు ఆపాదించినా కోపం రావడం సహజం, అవసరం కూడా. కానీ, అలా అన్నదెవరో, వ్రాసిందెవరో రిఫరెన్సులు ఇవ్వకుండా, వివరించకుండా కారాలు, మిరియాలు నూరడం గాలితో యుద్ధం చేస్తున్నట్లుంది. ఈ రిఫరెన్సులేవో రచయితకు, సంపాదకులకు తెలిసి ఉండవచ్చు. కానీ అది లోక విదితం అనుకోవడం పొరపాటు. ఇది తెలంగాణా తెలుగు కథా సాహిత్య చరిత్రకు సంబంధించిన పరిశోధనా వ్యాసం (రచయిత దీన్ని పరిశోధనా వ్యాసం కాదంటే, ఇదొక ఏకపాత్రాభినయం అనిపించే ప్రమాదం ఉంది!). పరిశోధనా వ్యాసానికి ముఖ్యంగా కావలసినవి ఆధారాలు, రిఫరెన్సులు. ఈ రెండు (ముఖ్యంగా రిఫరెన్సులు) లేకపోవడంతో ఈ వ్యాసానికి నిర్దిష్ఠత, పటిష్ఠత లోపించాయి. ఆవేశంతో కొట్టుకు పోయిన ఈ రచనలో నిర్మాణం దెబ్బతింది. నిర్మాణక్రమ లోపం వల్ల, విలువైన విషయాలు కూడా స్వగతంలో మాట్లాడుకునే మాటల్లానే ఉన్నాయి తప్ప వ్యాసానికి సమగ్రమైన ఆకృతిని ఇవ్వడంలో విఫలమయ్యాయి. ఆవేశం సృజనాత్మక ప్రక్రియలైన కవితకు, కథకు అలంకారమవుతుంది గాని, విషయ నిష్ఠతతో వ్రాయవలసిన పరిశోధనా వ్యాసాలకు కాదు. తెలంగాణా సాహిత్య చరిత్రకు సంబంధించిన ఎన్నో విలువైన విషయాలను తెలియజెప్పడానికి ప్రయత్నించిన వ్యాసం ఇలా పక్కదారి పట్టిపోవడం సమగ్రమైన తెలుగు చరిత్రను తెలుసుకోగోరే వాళ్ళ దురదృష్టం.

Copy right: 2004. Detroit Telugu Literary Club, Bloomfield Hills, MI, USA.